క్లుప్తంగా

ఘనంగా గ్రామ దేవతల కొలుపు



పూజలు చేస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

రామగిరి: ముత్తారం మండలం మచ్చుపేటలో రెండు రోజుల పాటు గ్రామదేవతల కొలుపు అంగరంగ వైభవంగా సాగింది. బుధవారం సాయంత్రం ఆలయం వద్ద గ్రామదేవతల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. పంబాల పూజారులు పట్నంవేసి కొలుపు ప్రారంభించారు. గ్రామ పొలిమేర చుట్టూ బంధనం వేశారు. గురువారం జెడ్పీచైర్మన్ పుట్టమధు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఇంజినీర్స్ డైరీ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ ఇంజనీర్

రామగుండం: బీ–థర్మల్ కేంద్రంలోని ఇంజినీర్స్ సమావేశ మందిరంలో గురువారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఏఈఏ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లను ఉద్దేశించి ఎస్ఈ ప్రసంగించారు. ఇంజినీర్లు పిల్లిరాజు, సమీర్, ఖాజా మొహినొద్దీన్, అశోక్, భానుకిరణ్, రాములు, చందన్, నజీమా భాను తదితరులున్నారు.

అంగన్‌వాడీకేంద్రం సందర్శన

రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని ముర్మూర్ మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్ బృందంతో సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యంపై కేంద్రం నిర్వాహకురాలు పెండ్యాల విమలతో చర్చించారు. కేంద్రంలో చిన్నారులకు అందించే పోషక పదార్థాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెల్త్ అసిస్టెంట్ సురేశ్, పంచాయతీ కార్యదర్శి శ్యాం కారోబార్ పీతాంబర్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

జూలపల్లి: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగంగా పూర్తిచేయాలని ఎంపీడీవో వేణుగోపాల్‌రావు సూచించారు. మండలంలోని నాగులపల్లె, తెలుకుంట, పెద్దాపూర్, కోనరావుపేట గ్రామాల్లోని మన ఊరు, మనబడి పనులను, నర్సరీలు, ఉపాధిహామీ పనులను గురువారం ఎంపీడీవో వేణుగోపాల్‌రావు పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన పనులు పారదర్శకంగా, నాణ్యతపాటించి చేయాలన్నారు. ఎంపీడీవో వెంట పెద్దాపూర్ సర్పంచ్ భారతి జ్యోతిబసు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

వైకుంఠరథం ఏర్పాటుకు విరాళం

ఓదెల: ఓదెల మండలం కనగర్తి గ్రామంలో వైకుంఠరథం ఏర్పాటుకు బీఎస్పీ రాష్ట్రకార్యదర్శి దాసరి హన్మయ్య రూ.15వేలు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు గురువారం అందించారు. గ్రామంలో ఎవరైనా కాలంచెల్లిన వారికి వైకుంఠరథం ఉపయోగపడుతుందని వైకుంఠరథం ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి లక్ష్మణ్, గ్రామాభివృద్ధి కమిటీసభ్యులు కసిరెడ్డి మహేందర్‌రెడ్డి, ఉడిగే సదయ్య, రాజు, సతీశ్, శ్రీనివాస్, ఎండీ. రసూల్, రామకృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామ పరిధిలోని రాజాపూర్‌కు చెందిన గరిగంటి ఓదెలుకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాసకొండ లక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు రాసకొండ రవి, దండె కిషన్, బొంతల ఓదెలు, గొడిసెలస్వామి, దండె ప్రదీప్ తదితరులున్నారు.

మల్లన్న ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ లక్ష్మణ్


జూలపల్లి: మండలకేంద్రంలోని కుర్మపల్లి కురుమసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లన్న పట్నాలు, బోనాలు కార్యక్రమంలో గురువారం జెడ్పీటీసీ, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

రెండోరోజు బ్రహ్మోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్: హరిహర దేవాలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రెండోరోజు వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మూలమూర్తులకు మహాకలశస్థాపన, నవగ్రహ పూజ, అభిషేకం, మండల హోమం, అన్నదానం నిర్వహించారు.

ఒంటికొస్తే ఆరుబయటకే..!

- ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఇబ్బందులు
- బాత్‌రూంకు తాళం వేయించిన ప్రధానోపాధ్యాయుడు
- ఇబ్బంది పడుతూ క్రీడా మైదానంలో మూత్ర విసర్జన చేస్తున్న విద్యార్థులు



ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జెడ్పీహైస్కూల్



బాత్‌రూంకు వేసిన తాళం (సర్కిల్‌లో)



ఆరుబయట మూత్రవిసర్జన చేస్తున్న విద్యార్థులు

జ్యోతినగర్: ఒంటికి వస్తే ఆరు బయటకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొనడంతో ఆరుబయట మూత్ర విసర్జన చేయలేక ఇబ్బందిపడుతున్నారు ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని జెడ్పీ హైస్కూల్ పాఠశాల విద్యార్థులు. జిల్లాలోనే ఎక్కువమంది చదువుతున్న పాఠశాలగా గుర్తింపు ఉండడంతో చాలామంది తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించేందుకు ఉత్సాహంచూపేవారు. కానీ నేడు ఆ పాఠశాలలో చదువుతున్న పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చదువు చెప్పడం మాట అటుంచి వారికి అత్యవసర సమయంలో వినియోగించుకోవాల్సిన బాత్‌రూంలు ఉండి కూడా వాటికి తాళాలు వేయడంతో వారు ఆరుబయట క్రీడా మైదానంలో గోడలే వారిక మూత్రశాలలుగా మారడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పారిశుధ్యం పనులు నిర్వహించే వారేరి..

ఎన్టీపీసీ సంస్థ భవనంలో నిర్వహించే హైస్కూల్‌లో పారిశుధ్యం పనులు, ఇతరత్రా పనులు నిర్వహించే వారు నలుగురు ఉండేవారు. వారికి ఎన్టీపీసీ సంస్థ వేతనాలు చెల్లించేది. కరోనా తర్వాత నుంచి వారికి వేతనాలు చెల్లించకపోవడంతో పాటు వారిని తొలగించడంతో రోడ్డునపడ్డారు. తమకు ఉపాధి కల్పించాలని కరీంనగర్ ఎంపీతో పాటు, ఎన్టీపీసీ సంస్థ అధికారులకు, కలెక్టర్‌కు సైతం మొరపెట్టుకున్నప్పటికీ వారిని విధుల్లోకి తీసుకోలేదు. ప్రస్తుతం పాఠశాలలో కిందిస్థాయి సిబ్బంది లేకపోవడంతో హైస్కూల్ వాతావరణం పూర్తిగా మారిపోయింది.

క్రీడా మైదానమే మూత్రశాలలు

హైస్కూల్ ఆవరణలోని క్రీడా మైదానంలోని గోడలే విద్యార్థులకు మూత్రశాలలుగా మారిపోయాయి. బాత్‌రూంలు ఉన్నప్పటికీ వాటిని సరిగ్గా వినియోగించుకోవడం లేదని హెచ్‌ఎం వాటికి తాళాలు వేయించారు. ఇక విద్యార్థులు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక అత్యవసరంగా ఒంటికి వస్తే ఆరు బయటకు వెళ్లక తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు.

పనివాళ్లు లేక మూసివేశాం

హైస్కూల్‌లో బాత్‌రూంలు ఉన్నప్పటికీ వాటిని శుభ్రం చేసే వారు లేక మూసివేశాం. గతంలో ఎన్టీపీసీ సంస్థ వారు వేతనాలు చెల్లిస్తే నలుగురు సిబ్బంది పనిచేసేవారు. వేతనాలు నిలిపివేయడంతో వారు పనులకు రావడం లేదు. మున్సిపల్ సంస్థ నుంచి వస్తున్న పారిశుధ్య కార్మికులు కేవలం పాఠశాలను శుభ్రంచేసి వెళ్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బాత్‌రూంలకు తాళాలు వేశాం. బాలికలకు మాత్రం బాత్‌రూంలు అందుబాటులో ఉన్నాయి. – శ్రీధర్, హెచ్‌ఎం, ప్రభుత్వ జెడ్పీహైస్కూల్, ఎన్టీపీసీ రామగుండం, టీటీఎస్

తాళాలు వేయొద్దు

ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో పిల్లల బాత్‌రూంలకు తాళాలు వేయొద్దు. హెచ్‌ఎంతో మాట్లాడతాను. బాత్‌రూంలకు తాళాలు తీసివేయాలని ఆదేశాలు ఇస్తాం. విద్యార్థులు ఆరుబయట మూత్ర విసర్జనకు సంబంధించిన విషయంపై విచారణ చేపడుతున్నాం.
– డి.లక్ష్మి, ఎంఈవో, రామగుండం

అసెంబ్లీలో అంగన్‌వాడీల సమస్యలు ప్రస్తావించాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

గోదావరిఖని: అసెంబ్లీలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు ప్రస్తావించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు గురువారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, సీఎం కేసీఆర్ పెంచిన వేతనాల మూడునెలల పీఆర్సీ ఉందని, 2018లో కేంద్రం పెంచిన వేతనాన్ని ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, ఆయా టీచర్ పోస్టులు భర్తీచేయాలని కోరారు.అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.వనజారాణి సహాయకార్యదర్శి ఎస్.రామలక్ష్మి ,ప్రాజెక్టు నాయకులు డి.పద్మ, సుజాత పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న జీఎం కె.నారాయణ

గోదావరిఖని: ఐఐటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఎలక్ట్రికల్ సిగ్నల్ ప్రాసెసింగ్‌లో ఫస్టీయర్ చదువుతున్న సింగరేణి ఉద్యోగి కుమార్తె అమూల్యకు రూ.12వేల చెక్కును ఆర్జీ1 జీఎం కె.నారాయణ గురువారం రీయింబర్స్‌మెంట్ చెక్కు అందించారు. ఏరియా వర్క్‌షాప్‌లో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న పెందోట రాజేశ్వరాచారి కుమార్తె సింగరేణి అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న ఉద్యోగుల పిల్లలకు సంస్థ చేయూత నందిస్తోందన్నారు. ఇదేస్ఫూర్తితో మిగితా ఉద్యోగుల పిల్లలు చదువులో రాణించి రీయింబర్స్‌మెంట్‌కు ఎంపిక కావాలని సూచించారు. ఉపాధ్యక్షులు గంద్ర దామోదర్‌రావు, జీఎం ఆఫీస్ ఇన్‌చార్జి ప్రవీణ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి అంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ సలీం, జీఎం పీఏ రాజశేఖర్, పర్సనల్ విభాగం పీఏ దేవాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండల, పట్టణవార్డు అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య నాయకులతో సమీక్షించారు. బీఆర్ఎస్ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని, వాటిని ప్రజలకు వివరించాల్సిన అవసరం కార్యకర్తలు, నాయకులకు ఉందన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి పలు పార్టీల నాయకులు, మహిళలు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో ఎంపీపీ బాలాజీ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత గౌడ్, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనికగౌడ్, సింగిల్‌విండో చైర్మన్లు, శ్రీగిరి శ్రీనివాస్ జూపల్లి సందీప్‌రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వీరగోని సుజాత గౌడ్, మండల అధ్యక్షు డు పురం ప్రేమ్ చందర్ రావు, యూత్ మండల అధ్యక్షుడు సతీశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కాదాసి చంద్రమౌళి, నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, ముత్యం రమేశ్‌గౌడ్, కలీం తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందిస్తున్న విద్యార్థులు

రామగిరి: ముత్తారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పుట్ట లింగమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజనం అందించాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు గురువారం బీఆర్ఎస్ నాయకులకు వినతిపత్రం అందించారు. మండలంలోని మారుమూల గ్రామాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు వచ్చి కళాశాలలో చదువుకుంటున్నారన్నారు. ఈనెల నుంచి ప్రాక్టికల్ పరీక్షలు, స్టడీ అవర్స్ ప్రారంభిస్తుండడంతో మధ్యాహ్న భోజనం లేక పస్తులతో పూర్తిగా అలసిపోతున్నామని వాపోయారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గతంలో మాదిరిగా ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేయాలని విద్యార్థులు కోరారు. విద్యార్థుల విన్నపం మేరకు సోమవారం నుంచి ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్ ఎంపీపీ సూదాటి రవీందర్‌రావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూనెకుమార్, సర్పంచ్ సంపత్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషన్ శిక్షణ తరగతులు

ముత్తారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పుట్ట ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను మండల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. విద్యార్థులు రాబోయే పరీక్షల్లో 100 ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు హైదరాబాద్‌కు చెందిన మోటివేషన్ డెవలప్‌మెంట్ అధ్యాపకులతో తరగతులు ఏర్పాటు చేయించారు.

అధికారం కోసం అబద్ధాలు



మాట్లాడుతున్న ఎంపీపీ కొండ శంకర్

మంథని: ఎన్నికలు సమీపిస్తుండడంతో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తిరిగి అధికారం కోసం అబద్ధాలు ఆడుతూ ప్రజల్ని తప్పుదోవపట్టిస్తున్నాడని ఎంపీపీ కొండశంకర్ అన్నారు. గురువారం మంథనిలోని జెడ్పీచైర్మన్ నివాసంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభివృద్ధి గురించి పట్టించుకోని ఎమ్మెల్యే ఉపాధి పథకంలో పెద్దఎత్తున నిధులు తెచ్చినట్లుగా గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జెడ్పీచైర్మన్ పుట్టమధు మొదటి విడతలో రూ.8.34 కోట్లు, రెండో విడతలో 75 పనులకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిధులు మంజూరుచేయించారన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు రెండో విడతలో కేవలం రూ.2.03 కోట్లు మాత్రమే ప్రతిపాదనలు చేశారన్నారు. జెడ్పీచైర్మన్ సిఫారసుతోనే రూ.15.84 కోట్లు మంజూరయ్యాయన్నారు. మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగులకు వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ట్రాన్స్‌కో ఉద్యోగుల కుటుంబ సభ్యులకు గురువారం హైదరాబాద్‌లోని యశోధ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్యపరీక్షలు చేసినట్లు ఎస్ఈ బొంకూరి సుదర్శన్ తెలిపారు. దాదాపు 220 కుటుంబాలకు చెందిన ఉద్యోగులు పరీక్షలు చేయించుకున్నట్లు పేర్కొన్నారు.

తాత్కాలిక భవనంలోకి జిల్లా గ్రంథాలయం



తాత్కాలిక భవనంలో జిల్లా గ్రంథాలయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలోని టీవీ రీలే కేంద్రంలోకి గురువారం మార్చారు. గ్రంథాలయాన్ని కొత్త మున్సిపల్ భవన నిర్మాణం కోసం ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు, పాలక మండలి కోరినా జిల్లా గ్రంథాలయ సంస్థ స్పందించలేదు. మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించేందుకు గ్రంథాలయ భవనం అడ్డుగా ఉందని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరగా.. ఖాళీ అయిన దూరదర్శన్ కేంద్రభవనంలోకి మార్చుకున్నారు. ఇందుకు రూ.30లక్షలు చెల్లించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

సూర్య నమస్కారాలు ఆరోగ్యానికి మేలు



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: సూర్య నమస్కారాలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యనిర్వాహకులు రామిరెడ్డి అన్నారు. టీటీడీ, హిందూధర్మ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం యైటింక్లయిన్‌కాలనీ శ్రీవాణి హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన రథసప్తమి వేడుకల్లో మాట్లాడారు. విద్యార్థుల్లో భక్తిభావన పెంపొందించుటకు సూర్యనమస్కారాలతోపాటు అచ్యుతాష్టకం విష్ణు సహస్రనామాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు విష్ణు సహస్రనామాల పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మాచార్యులు సతీశ్, వీరన్న, సదయ్య, పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఏ జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న నాయకులు

రామగిరి: సింగరేణి సంస్థ ఏపీఏ జీఎంగా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కె.వెంకటేశ్వర్లుకు స్వాగతం పలికారు. గుర్తింపు కార్మికసంఘం టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతమ్ శంకరయ్య ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలు జీఎం దృష్టికి తీసుకెళ్లడంతో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్శ బక్కయ్య, కాంతల కిషన్‌రెడ్డి, కోడూరి రాజయ్య, గాజుల తిరుపతి, దాసరి మల్లేశ్, వీవీ.గౌడ్, రమేశ్, భూపాల్‌రెడ్డి, మేకల మల్లేశం, నరేశ్, శంకరయ్య, తోట రవి, సారయ్య, సతీశ్‌రెడ్డి, క్రాంతి, రమేశ్, అనుదీప్ పాల్గొన్నారు.

బీసీ జనగణన చేపట్టాలి



మాట్లాడుతున్న గొర్రె రమేశ్

గోదావరిఖని: బీసీ జనగణన చేపట్టేలా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తెలంగాణా లేబర్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొర్రె రమేశ్ డిమాండ్ చేశారు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 60శాతం ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికపై సీట్లు కేటాయించాలని, దళితుల మాదిరిగానే బీసీలకు బీసీ బంధు ప్రవేశపెట్టాలన్నారు. రూ.3లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.1.60లక్షల కోట్లు బీసీలకు కేటాయించాలన్నారు. బీసీ వర్గానికి చెందిన మహాత్మ జ్యోతిరావు పూలేకు రాష్ట్రంలోని ఒక జిల్లా పేరు పెట్టాలన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో 9 మందికి బీసీ మంత్రులుగా అవకాశం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు డబుల్ బెడ్రూంల ఇళ్లు కేటాయించాలన్నారు. నాయకులు మంథని మల్లేశ్, తిరుపతి, గాజుల రమేశ్, లింగయ్య, జీవన్‌రావు, అఖిల్‌వర్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు' వైద్యశిబిరం

జూలపల్లి: మండలకేంద్రంతో పాటు కుమ్మరికుంటలో గురువారం నిర్వహించిన కంటివెలుగు వైద్యపరీక్షలు కొనసాగాయి. జూలపల్లిలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు అందించారు. జూలపల్లిలో154 మందికి పరీక్షలుచేసి 18 మందికి అద్దాలు అందించారు. కుమ్మరికుంటలో 131 మందికి పరీక్షలు చేసి 33 మందికి అద్దాలు అందించారు. నేడు బాలరాజుపల్లెలో కంటివెలుగు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి సంపత్‌రెడ్డి తెలిపారు.

153 మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలకేంద్రంలోని జీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటివెలుగులో గురువారం 153 మందికి కంటిపరీక్షలు చేసినట్లు వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా తెలిపారు. 8మందికి కంటి అద్దాలు పంపిణీ చేసి మందులు పంపిణీ చేశారు.

ధర్మారంలో 703 కంటి వెలుగు వైద్య పరీక్షలు

ధర్మారం: మండలంలోని మేడారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం 1338 మందికి కంటిపరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి అనుదీప్ తెలిపారు. కొత్తూరు, దొంగతుర్తి, మేడారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో 1338 మందికి పరీక్షలు చేయగా 650 మంది పురుషులు, 688 మంది మహిళలున్నారు. రీడింగ్ గ్లాస్ 208 మందికి, ప్రిస్క్రిప్షన్ గ్లాసులు 167 మందికి అందించామన్నారు.

కన్వెన్షన్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

కమాన్‌పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కన్వెన్షన్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి వారికి వేతనాలు పెంచాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి గాండ్ల మోహన్ అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–1 వద్ద డ్రైవర్లు చేపట్టిన సమ్మెశిబిరాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. సింగరేణి జీవో ప్రకారం డ్రైవర్లకు నెలకు రూ. 21వేలు వేతనం చెల్లించాల్సి ఉండగా లారీ, టిప్పర్ల ఓనర్లు కేవలం రూ.16వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. దీంతో వారి కుటుంబాలను పోషించుకోలేక డ్రైవర్లు సమ్మెబాట పట్టారన్నారు. సింగరేణి యాజమాన్యం లారీ, టిప్పర్ల ఓనర్లతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ శంకరయ్య, రంగు సత్యనారాయణగౌడ్, ఇక్బాల్, మల్యాల తిరుపతి వెంట ఉన్నారు.

ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామగిరి: ముత్తారం మండలం మచ్చుపేట జీపీ పరిధిలోని బగుల్ల ఆలయాల ప్రధాన రహదారిపై సీసీరోడ్డు నిర్మాణానికి రూ 2.50 కోట్ల నిధులు కేటాయించినందుకు సీఎం కేసీఆర్, పంచాయితీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెడ్పీచైర్మన్ పుట్టమధు చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అత్తే చంద్రమౌళి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నూనెకుమార్, సర్పంచ్ మెడగోని సతీశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి

ముత్తారం మండలకేంద్రంలోని అడవిశ్రీరాంపూర్ చౌరస్తా వద్ద మండల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కార్పెంటర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మడపోజు వెంకట్రాజం మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి రూపొందించిన పీఎం వికాస్‌యోజన పథకానికి కృతజ్ఞతగా చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనర్సయ్య



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ లక్ష్మీనర్సయ్య గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధ్యాపకులతో కలిసి కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాలలో కొనసాగిన అధ్యాపకుడు నితీన్ ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు కల్పించారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీనర్సయ్యకు పదోన్నతి కల్పించి పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.